

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు 27న సెలవు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 27న ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు యాజమాన్యాలు కూడా ఉద్యోగులు పోలింగ్ రోజున వారి ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా విధులకు ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతివ్వాలి. లేదా షిఫ్టుల సర్దుబాట్లు, తక్కువ సమయం డ్యూటీ గంటలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు.


నరసన్నపేటలోని బోర్డు బంగ్లా స్థలంలో మళ్లీ చేపడుతున్న పనులు

అధికారం పోయినా.. తగ్గట్లే!

- బోర్డు బంగ్లా స్థలం తమదంటున్న వైసీపీ నాయకులు
- ఏకంగా నిర్మాణాలు ప్రారంభించిన వైనం
- అయినా మౌనం దాల్చిన అధికారులు
- కోర్టు ఉత్తర్వులపై కౌంటర్ వేయని 'సుడా'
- గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా అనుమతులు

నరసన్నపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి)

నరసన్నపేటలో కోట్లాది రూపాయలు విలువ చేసే బోర్డు బంగ్లా స్థలం ఆక్రమణపై వైసీపీ నాయకులు వెనుకడుగు వేయడం లేదు. గతంలో ఈ స్థలంలో నిర్మాణాలకు యత్నించగా అధికారులు అడ్డుకున్నారు. తాజాగా మళ్లీ శనివారం నుంచి పనులు చేసేందుకు వైసీపీ నాయకులు ఉపక్రమించారు. కాగా.. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలు అనుమతులతో బోర్డు బంగ్లా స్థలం ఆక్రమణకు గురైందని స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆరోపించారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి అక్రమాలను అడ్డుకోవాలని కలెక్టర్, ఎస్పీకి లేఖ రాశారు.

ఏం జరిగిందంటే..

జిల్లాపరిషత్‌కు సంబంధించి నరసన్నపేటలోని సుమారు రూ.10కోట్ల విలువైన బోర్డు బంగ్లా స్థలంపై స్థానికుల కన్ను పడింది. గతంలో పట్టణానికి చెందిన ఒక వ్యాపారి, వైసీపీ నాయకులు ఈ స్థలాన్ని ఆక్రమించి.. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. బజారువైపు ప్రహరీ కూడా నిర్మించారు. మరోపక్క ఆమదాలవలసకు చెందిన ఒక ఆసామి.. ఈ స్థలాన్ని కొనుగోలు (మిగతా 6వ పేజీలో..)


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

కలెక్టర్, ఎస్పీకి ఎమ్మెల్యే లేఖ..

నరసన్నపేట పట్టణ నడిబొడ్డున జిల్లా పరిషత్‌కు చెందిన బోర్డు బంగ్లాకు చెందిన 39 సెంట్లలో నాలుగు సెంట్లు స్థలాన్ని తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కోర్టు అనుమతి ద్వారా చేపడుతున్న నిర్మాణాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని కలెక్టర్, ఎస్పీకి లేఖలు రాశానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'పూర్వం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉండే స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా తప్పుడు పత్రాలు సృష్టించారు. ఆపై సుడా అనుమతి ఇవ్వడం వెనుక గత ప్రభుత్వ హయంలో పెద్ద తలకాయల హస్తం ఉంది. దీనిపై పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి కోర్టుకు నివేదిక సమర్పించాలి. సుడా అధికారులు కూడా స్థలాన్ని పరిశీలించకుండానే అనుమతులు ఇవ్వడంపై దర్యాప్తు చేపట్టాల'ని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, గొద్దు చిట్టిబాబు, బైరి భాస్కరరావు, నేతింటి విశ్వేశ్వరరావు, బలగ భారతి, బోయన సతీష్, జామి వెంకట్రావు పాల్గొన్నారు.

సమాచారం

నేడు గ్రూప్-2 పరీక్ష

- 15 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ అభ్యర్థులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న గ్రూప్-2 సర్వీసెస్ పరీక్ష ఆదివారం జరుగనుంది. జిల్లాలోని శ్రీకాకుళం మండలంలో 8, ఎచ్చెర్ల మండలంలో 7 కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. 5,535 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు(మొబైల్, కాలిక్యులేటర్, స్మార్ట్ వాచ్, బ్లూటూత్) వెంట తీసుకువెళ్లకూడదు. గ్రేస్ పీరియడ్ కేవలం 15 నిమిషాల వ్యవధి ఉంటుంది. ఆ తర్వాత ఎవరినీ అనుమతించరు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటుగా తప్పనిసరిగా ప్రభుత్వం జారీచేసిన గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తీసుకువెళ్లాలి. ఏమైనా సందేహాలుంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 08942 240557 నెంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

'నౌపడా-గుణుపూర్' డబుల్‌లైన్ సర్వేకు నిధులు

టెక్కలి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నౌపడా-గుణుపూర్ బ్రాడ్‌గేజ్ డబుల్ లైన్ సర్వేకు రూ.3.30కోట్ల నిధులను ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం దీపక్‌సింగ్ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవతో మంజూరు చేశారు. నౌపడా నుంచి గుణుపూర్ వరకు 165 కిలోమీటర్ల పరిధి డిటేల్ ప్రాజెక్ట్ రిపోర్టు సిద్ధం చేసేందుకుగాను ఈ నిధులు మంజూరయ్యాయి. ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు ఈ డబుల్‌లైన్ సర్వే పనులు ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. దీంతో ఈ ప్రాంతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అయ్యో.. నీ భవిష్యత్ కోసమే కదా!

అయ్యో కన్నా.. నీ బంగారు భవిష్యత్తు కోసమే కదా వారి తపన! నిన్ను ఉన్నత స్థాయిలో చూడాలని వారికుండదా! తాము పడిన కష్టాలు పడకూడదనే కదా నీకు చెప్పింది. అయినా వారేం అన్నారు నిన్ను! బాగా చదువుకోరా? అని కాస్త మందలించారు. ఈమాత్రం దానికే అంత పెద్దశిక్ష విధించుకుంటావా? ఆ తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతావా? ఆ ఆలోచన వచ్చినప్పుడు ఒక్కక్షణం.. ఒక్కక్షణం.. ఆలోచించి ఉంటే! ఇంత ఘోరం జరిగేదా? నీపైనే ఆశలు పెట్టుకున్న అమ్మానాన్నకు అండగా ఉండేవాడివి కదా! నువ్వు చేసింది మంచిది కాదురా చిన్నా!

- చదువుకోవాలని మందలించారని..
- మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


యశ్వంత్ (ఫైల్)

పలాస, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'పరీక్షలు దగ్గర పడుతున్నాయి. బాగా చదువుకో. అనవసర తిరుగుళ్లు వద్దు' అని తల్లిదండ్రులు.. ఇంటర్ చదువుతున్న వారి కుమారుడిని మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆ విద్యార్థి శుక్రవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత ఈ విషయం బయటపడింది. దీంతో తల్లిదండ్రులు పుట్టెడు శోకంలో మునిగిపోయారు. సీఐ బి.సూర్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పద్మనాభపురం కాలనీకి చెందిన బుడమూరు దుర్గారావు, పాపమ్మ దంపతుల కుమారుడు యశ్వంత్(17) కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజులుగా యశ్వంత్ వివాహాలు, వేడుకలకని ఇంటి వద్ద చెబుతూ బయటకు వెళ్లిపోతున్నాడు. దీంతో పరీక్షలు దగ్గర పడుతున్నాయని, బయట తిరగకుండా బాగా చదువుకోవాలని మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన యశ్వంత్.. తల్లిదండ్రులు నిర్వహిస్తున్న ఇటుకబట్టీ సమీపంలో ఓ ఇంట్లోకి వెళ్లి ఉరేసుకున్నాడు. యశ్వంత్ శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్లి సాయంత్రం వరకూ రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. అనుమానంతో కళాశాలకు వెళ్లి సంప్రదించగా.. అసలు కాలేజీకే రాలేదని సిబ్బంది చెప్పారు. దీంతో మరింత ఆందోళన చెంది కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు యశ్వంత్ కోసం గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. రాత్రి 9.30గంటల సమయంలో కోసంగిపురం రహదారిలో ఇటుకబట్టి సమీపంలో (మిగతా 6వ పేజీలో..)


ఆపసోపాలతో పూజల మధ్య సాగిన వేడుకలు

వాసుదేవుడి తెప్పోత్సవం

పొన్నచెట్టు వాహనంపై వాసుదేవుడు

- భక్తజనావళి నడుమ ఘనంగా తెప్పోత్సవం
- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

6లో

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

8లో


శ్రీముఖలింగంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

భక్తులకు ఏలోటూ రాకూడదు

- సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్
- మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

6లో


రాళ్లు తేలిన ఆల్‌ఆంధ్రా రహదారి

వారం రోజుల్లోనే.. పోయింది

- ఆల్‌ఆంధ్రారోడ్డు పనుల్లో నాణ్యతాలోపం

మెళియాపుట్టి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారుల మరమ్మతులకు గత ప్రభుత్వ నిధులు విడుదల చేయకపోవడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక కష్టాలు ఉన్నా.. సంక్రాంతిలోగా రహదారులు మరమ్మతులు చేయాలని సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా పాతపట్నం నుంచి మెళియాపుట్టి వచ్చే ఆల్‌ఆంధ్రారోడ్డు మరమ్మతుల కోసం రూ.56లక్షలు కేటాయించారు. టెక్కలి నియోజకవర్గానికి చెందిన ఒక కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఈ మేరకు వారం రోజుల కిందట పనులు చేపట్టారు. కాగా.. రోడ్డుపై వేసిన తారు వారం రోజులకే వదిలేసి.. రాళ్లు తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిధులు వెచ్చించినా.. తూతూమంత్రంగా (మిగతా 6వ పేజీలో..)


రహదారిపై తారు ఇలా..


మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

గంజాయి కేసుల్లో దర్యాప్తు వేగవంతం

- డీఐజీ గోపీనాథ్ జెట్టి

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, ఇతర మాదకద్రవ్యాల కేసుల్లో నేరస్థులకు శిక్ష పడేలా దర్యాప్తు మరింత వేగవంతం చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. శనివారం ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర కళాశాలలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసు అధికారులకు వర్క్‌షాపు నిర్వహించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ, కేసుల దర్యాప్తులో నిబంధనలు, నియమాలు, నైపుణ్యంపై చర్చించారు. డీఐజీ మాట్లాడుతూ.. 'రాష్ట్ర ప్రభుత్వం గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రధాన అంశంగా తీసుకుంది. గంజాయి రవాణా, వ్యాపారుల మూలాలను తెలుసుకుని, కేసుల నమోదు, దర్యాప్తులో జాగ్రత్తలు తీసుకోవాలి. రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో ఇప్పటివరకు ఎస్ఐ నుంచి ఏఎస్పీ స్థాయి వరకు 320మంది పోలీసు అధికారులకు చట్టాలపై అవగాహన కల్పించాం. శిక్షలు పడినప్పుడే గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టగలం. గంజాయి కేసుల్లో దర్యాప్తునకు నైపుణ్యమే కీలకమ'ని తెలిపారు. కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ అధికారి ఎ.రంగధామ్ మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి చట్టపరమైన అంశాలు, దర్యాప్తు ప్రక్రియలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గంజాయి వంటి మాదకద్రవ్యాల కేసులో చట్టప్రకారం నిబంధనలు పాటిస్తూ దర్యాప్తు పూర్తిచేయాలన్నారు. కేసుల దర్యాప్తులో న్యాయ సలహాదారులను, నిపుణుల సూచనలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, ఏఎస్పీలు కేవీ రమణ, అంకిత సురాన, డీఎస్పీలు వీవీ అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.


- ఇచ్ఛాపురం మండలం సన్యాసిపుట్టుగకు చెందిన నీలాపు ధర్మరాజురెడ్డి గత నెల 28న గుండెపోటుకు గురయ్యారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఛాతినొప్పి రాగా.. వెంటనే కుటుంబ సభ్యులు ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు సిద్ధంగా ఉన్న టెనెక్టేప్లెస్ ఇంజక్షన్‌ను ఉచితంగా వేయడంతో ఆయన కోలుకున్నారు. రెండు రోజుల తర్వాత శ్రీకాకుళం మండలం రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో యాంజోగ్రామ్ చేశారు. స్టంట్స్ అవసరం కావడంతో ఆరోగ్యశ్రీలో భాగంగా వేశారు. ఈ నెల 10న ఆయన క్షేమంగా ఇంటికి చేరుకున్నారు.

- ఏడాది కిందట ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి గుండెపోటుకు గురయ్యాడు. ఇంట్లో ఉండగా ఛాతినొప్పితో పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాసలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు రూ.45వేలు విలువ చేసే టెనెక్టేప్లెస్ ఇంజక్షన్‌ను వేశారు. కోలుకున్న తరువాత విశాఖ తరలించి అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో యాంజోగ్రామ్ తరువాత స్టంట్స్ వేశారు.

పేదల గుండెకు.. భరోసా

- గుండెపోటుకు ఉచితంగా ఖరీదైన ఇంజక్షన్లు
- ప్రభుత్వాసుపత్రులకు సరఫరా
- జిల్లాలో అందుబాటులో 137 డోసులు
- సకాలంలో స్పందిస్తేనే.. మేలు


హరిపురం/ ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):

గుండెపోటు బాధితులకు భరోసా కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.45 వేలు విలువ చేసే.. టెనెక్టేప్లెస్ ఇంజక్షన్‌ను ఉచితంగా అందిస్తోంది. అన్ని ప్రాంతీయ, సామాజిక ఆస్పత్రుల్లో వీటిని అందుబాటులో ఉంచడంతో ఎంతోమంది పేద ప్రజల గుండెకు కొండంత భరోసా కలుగుతోంది. అత్యవసర సమయాల్లో ఈ ఇంజక్షన్లు గుండె సంబంధిత వ్యాధిగ్రస్థుల ప్రాణాలు నిలుపుతున్నాయి. సాధారణంగా గుండెపోటు బాధితులకు రక్తం సరఫరా చేసే నాళాలు గడ్డకడతాయి. దానిని నియంత్రించేందుకు ఈ ఇంజక్షన్లు దోహదపడతాయి. పట్టణాలు, నగరాల్లోని పేరుమోసిన ప్రైవేటు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండేవి. పైగా ఒక్కో ఇంజక్షన్ ధర సుమారు రూ.45వేలు ఉండగా.. చాలా మంది పేదలు ఆర్థికభారంతో కొనుగోలు చేయలేకపోయేవారు. అలా ఇంజక్షన్లు అందక చాలామంది మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని సామాజిక ఆస్పత్రుల్లోనూ ఈ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచి పేదలకు ఉచితంగా అందజేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఎంతో మంది ప్రాణాలను కాపాడుతోంది.

పూర్తి వివరాలు 6లో..

పేదల గుండెకు.. భరోసా

- గుండెపోటుకు ఉచితంగా ఖరీదైన ఇంజక్షన్లు ● ప్రభుత్వాసుపత్రులకు సరఫరా
- జిల్లాలో అందుబాటులో 137 డోసులు ● సకాలంలో స్పందిస్తేనే.. మేలు





హరిపురం సీహెచ్‌సీ...

హరిపురం/ ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి)

కొవిడ్ తరువాత చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అధిక శాతం గుండెపోటుకు గురవుతున్నారు. గుండెపోటు వచ్చిన వారిని రక్షించడం, చికిత్స అందించడంలో తొలిగంటే కీలకమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం స్టెమీ పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గుండెపోటు వచ్చిన వ్యక్తిని ప్రాణాపాయ పరిస్థితి నుంచి రక్షించేందుకు వీలుగా జిల్లా కేంద్రంతో పాటు ఏరియా ఆసుపత్రుల్లో టెనెక్టెప్లెస్ ఇంజక్షన్లను అందుబాటులో ఉంచింది. గుండెపోటుకు గురైన వ్యక్తికి రక్తం సరఫరా చేసే నాళాలు గడ్డ కడతాయి. దానిని నియంత్రించేందుకు ఈ ఇంజక్షన్లు ఎంతగానో దోహదపడతాయి. గుండె పోటుకు గురైన గంట వ్యవధిలో వీటిని అందించాల్సి ఉంటుంది. అలా ఇంజక్షన్లు అందక చాలామంది మృత్యువాత పడుతుంటారు. గుండె పోటు లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తరలించాలి. ఈసీజీ వంటి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి... గుండెపోటు లక్షణాలున్నట్లు వైద్యులు నిర్ధారణకు వస్తే రూ.45 వేల విలువ చేసే టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను ఉచితంగా అందించి ప్రాణాపాయం నుంచి కాపాడుతారు. ఆపై మెరుగైన వైద్య సేవల కోసం రిఫర్ చేస్తారు. ఎన్.టి.ఆర్. ఆరోగ్యసేవలో వైద్య సేవలు ఉచితంగా అందజేస్తారు. జిల్లాలోని మొత్తం 18 ఆస్పత్రుల్లో 137 డోసులు ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా జిల్లా శివారు ప్రాంతాల వారికి ఈ ఇంజక్షన్లు ప్రాణాలు నిలుపుతున్నాయనే చెప్పొచ్చు. ఇచ్ఛాపురం, సోంపేట ప్రాంతాలవారు అత్యవసర వైద్యసేవలకు శ్రీకాకుళం, విశాఖ వెళ్లాలంటే చాలా కష్టం. ఈ నేపథ్యంలో స్థానికంగా సీహెచ్‌సీల పరిధిలోనే ఈ ఇంజక్షన్లు అందుబాటులో ఉండడంతో ఎంతోమందికి ఉపశమనం లభిస్తోంది.

● మొత్తం 92 మందికి..

హరిపురం సీహెచ్‌సీ పరిధిలో గడచిన రెండు నెలల కాలంలో ఐదుగురు వ్యక్తులకు ఈ ఇంజక్షన్ ద్వారా ప్రాణాలు కాపాడారు. అందులో ముగ్గురు తక్షణమే కోలుకోవడంతో ఇళ్లకు పంపించారు. మరో ఇద్దరిని జిల్లా సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. వారిద్దరూ కోలుకున్నారు. గత ఆరు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 92 మందికి ఈ ఇంజక్షన్లు వేయడం ద్వారా ప్రాణాలు నిలిపినట్టు డీసీహెచ్‌ఓ డాక్టర్ కల్యాణ్‌బాబు తెలిపారు.

● ఇవీ లక్షణాలు..

ఛాతిలో నొప్పిగా అనిపించడం, ఎడమ భుజం లాగడం, ఉన్న ఫళంగా ఆయాసం రావడం, గుండె వేగంగా కొట్టుకోవడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే గుండెపోటుగా గుర్తించాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక చికిత్స కోసం ప్రయత్నాలు ప్రారంభించాలి. దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలి.

ఎంతో ప్రయోజనకరం..

జీవనశైలిలో మార్పులతో వస్తున్న రక్తపోటు, మధుమేహంతో దీర్ఘకాలంలో చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ క్రమంలోనే గుండె జబ్బుల ముప్పు పెరుగుతోంది. వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరితే రూ.లక్షల్లో ఖర్చవుతోంది. గుండెపోటు లక్షణాలు గుర్తించలేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. ప్రధానంగా చిన్న పట్టణాలు, మారుమూల గ్రామాల వారికి గుండె వైద్య నిపుణులు అందుబాటులో ఉండరు. బాధితులు దూరంలో ఉన్న ప్రధాన ఆసుపత్రులకు వెళ్లే లోపు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది.

● ఆస్పత్రుల వారీగా ఇలా..

జిల్లాలోని సీహెచ్‌సీలు, ప్రధాన ఆస్పత్రులైన టెక్కలి, పలాస, హరిపురం, సోంపేట, కొత్తూరు, కవిటి, రణస్థలం కోటబొమ్మాళి, పొందూరు, నరసన్నపేట, బుడితి, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పాతపట్నం, బారువ ఆస్పత్రుల్లో ఈ ఇంజక్షన్లను అందుబాటులో ఉంచారు. వీటి వినియోగంపై ఇప్పటికే వైద్యులకు శిక్షణ అందించారు. ఇంజక్షన్ వేసేందుకు ప్రతి వైద్యశాలలో ప్రత్యేకంగా స్టెమ్ గదిని ఏర్పాటు చేశారు.

● యాప్ ద్వారా పర్యవేక్షణ..



ఆస్పత్రుల్లో పడకల సామర్థ్యాన్ని బట్టి కనీసం అయిదు ఇంజక్షన్లకు తగ్గకుండా అందుబాటులో ఉంచుతున్నారు. హరిపురం ఆస్పత్రికి తొమ్మిది ఇంజక్షన్లు పంపించారు. అవసరం మేరకు మళ్లీ తెప్పిస్తాం. గుండె నొప్పితో వచ్చిన వారికి ముందుగా స్టెమ్ గదిలో ఈసీజీ తీసి అందులో గుర్తించిన తీవ్రత, అవసరాన్ని బట్టి ఇంజక్షన్ ఇస్తారు. దీనివల్ల రక్తం గడ్డ కట్టకుండా సులభంగా ప్రసరణ జరుగుతుంది. మరోసారి ఈసీజీ తీసి రిపోర్టును ప్రత్యేక యాప్ ద్వారా జీజీహెచ్‌లోని కార్డియాలజిస్టుకు పంపుతారు. ఆయన సలహా మేరకు పరిస్థితి బాగుంటే ఇంటికి పంపిస్తాం. లేదంటే పెద్దాసుపత్రికి రిఫర్ చేస్తాం.

-డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, హరిపురం

● ప్రభుత్వాస్పత్రికి తేవాలి..



గుండెపోటు లక్షణాలు కనిపించిన గంట లోపు చాలా కీలకం. వెంటనే ప్రభుత్వాస్పత్రులకు తీసుకెళ్తే ఈసీజీ తీస్తారు. గుండెపోటు అని తేలితే వెంటనే ఇంజక్షన్ చేస్తారు. ఆపై ఆరోగ్యశ్రీ విభాగం వైద్యసేవలు ఉన్న ఆస్పత్రులకు తరలించి ఆపరేషన్లు చేస్తారు. అవగాహన లేక చాలామంది ఈ సేవలు వినియోగించుకోవడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ ఇంజక్షన్లు అందుబాటులోకి వచ్చాయన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలి.

-పి.దేవేంద్ర రెడ్డి, సూపరింటెండెంట్, ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రి

నేడు ఎర్రన్నాయుడి 68వ జయంతి

- ఎర్రన్న ఘాట్‌ను సందర్శించనున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు



టెక్కలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నిమ్మాడ నుంచి న్యూఢిల్లీ వరకు ఎన్నో పదవులు అలంకరించారు. ఐక్యరాజ్యసమితిలో తన గళం వినిపించారు. ఆయనే కింజరాపు ఎర్రన్నాయుడు. ఆదివారం ఎర్రన్నాయుడి 68వ జయంతి. ఈ సందర్భంగా ఎర్రన్నఘాటన్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు సందర్శించి నివాళులు అర్పించనున్నారు. 1957 ఫిబ్రవరి 23న జన్మించిన ఆయన న్యాయవాదిగా రాణిస్తూనే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీ రామారావు చొరవతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. మూడు దశాబ్దాలు కాలం పార్టీకి, ప్రజలకు సేవలందించారు. నాలుగుసార్లు హరిశ్చంద్రాపురం శాసనసభ్యుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చీఫ్ విప్‌గా, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, నాలుగుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రిగా, రైల్వేస్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా అనేక పదవులు చేపట్టారు. పార్టీలో కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవడంలో ఆయన ముందు వరుసలో ఉండేవారు. 2009 లోక్‌సభకు కిల్లి కృపారాణి మీద ఒకసారి ఓటమి తప్ప మిగతా ఎన్నికల్లో ఒక్కసారి కూడా ఆయన ఓటమి చెందలేదు. 1983,1985,1989, 1994లో హరిశ్చంద్రాపురం ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎర్రన్నాయుడు.. 1996, 1998, 1999, 2004, 2008లో పార్లమెంట్ సభ్యుడిగా ఐదుసార్లు ఎన్నికయ్యారు. తెలుగుదేశం పార్టీలో 3 దశాబ్దాలు కాలం పాటు చక్రం తిప్పిన ఎర్రన్నాయుడు ఊహించని రీతిలో 2012 నవంబరు 2 రోడ్డు ప్రమాదంలో కన్ను మూశారు. నాడు కేంద్రమంత్రిగా ఎర్రన్నాయుడు రాణిస్తే నేడు ఆయన కుమారుడు రామ్మోహన్‌నాయుడు కేంద్ర విమానయాన శాఖామంత్రి గా పనిచేస్తున్నారు. సోదరుడు అచ్చెన్నాయుడు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

అధికారం పోయినా.. తగ్గట్లే!

(ఐదో పేజీ తరువాయి)



బోర్డు బంగ్లా స్థలం వద్ద గతంలో అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

చేశానని డాక్యుమెంట్లు చూపించాడు. సుడా అనుమతులతో నిర్మాణాలు చేపడుతున్నామని, ఇందుకు కోర్టు కూడా అనుమతి ఇచ్చిందని పత్రాలు చూపుతున్నాడు. నిర్మాణాలు చేపట్టేందుకు గతంలో ప్రయత్నించగా అధికారులు అడ్డుకున్నారు. మళ్లీ ఈ నెల 20న ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా.. ఎంపీడీవో బి.మధుసూదనరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ స్థలంలో నిర్మాణాలను అడ్డుకున్నారు. తాజాగా శనివారం కొంతమంది వైసీపీ నాయకులు ఈ స్థలంలో నిర్మాణాలు చేపట్టడం చర్చనీయాంశమైంది. గతంలో పనిచేసిన ఒక తహసీల్దార్ అనుమతి ఇవ్వడం.. ఆపై సుడా నుంచి అనుమతులు పొంది వైసీపీ నాయకులు.. బోర్డు బంగ్లా స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు ముందడుగు వేస్తున్నారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన అధికారులకు కోర్టు ఉత్తర్వులు చూపించి భయపెడుతున్నారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు..

బోర్డు బంగ్లా స్థలం.. ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గత ప్రభుత్వ హయంలో ఎన్‌వోసీ ఇచ్చిన రెవెన్యూ అధికారులపై కానీ, ఈ స్థలంలో నిర్మాణాలకు సుడా అనుమతులు ఇవ్వడంపై కానీ జిల్లా ఉన్నతాధికారులు స్పందించకపోవడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు సిఫారసులకు తలొగ్గారనే విమర్శలు ఉన్నాయి. తప్పుడు పత్రాలతో సుడా అనుమతి సైతం తీసుకుని వైసీపీ నేతలు నిర్మాణాలకు సిద్ధమవుతున్నారు. ఈ స్థలంలో నిర్మాణాలు చేసుకునే విధంగా కోర్టు ఉత్తర్వులు సైతం తీసుకువచ్చారు. ఈ వివాదం 2023 డిసెంబరు 16న జరిగింది. అప్పుడే కోర్టులో పంచాయతీరాజ్, సుడా, రెవెన్యూ అధికారులు కోర్టులో కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. అప్పట్లో పంచాయతీరాజ్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. కానీ, సుడా అధికారులు కౌంటర్ దాఖలు చేయకపోవడంతో ప్రస్తుతం నిర్మాణాలకు కోర్టు అనుమతులు ఇచ్చింది. ఈ స్థలంపై వివాదం జరుగుతున్నా జిల్లా అధికారులు ఇంతవరకు స్పందించపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కలెక్టర్ స్పందించి ప్రభుత్వానికి చెందిన ఈ స్థలాన్ని పరిరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఎంపీడీవో బి.మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా బోర్డు బంగ్లా ఆస్తి.. పరిరక్షిస్తామని, న్యాయపరంగా పోరాటం చేస్తామని తెలిపారు.



కావడిలో మనమరాలిని తీసుకువెళుతున్న తాత

తాతా.. నేనూ వస్తా

- కావడిలో మనుమరాలిని తీసుకెళ్తూ..

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జీడి తోట పనులకు వెళ్తున్న తాత కావిడిలో ఒక పక్క మనుమరాలిని, మరోపక్క పనులకు సంబంధించిన సామగ్రిని తీసుకువెళుతున్న దృశ్యాన్ని శనివారం 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది. తాను పనులకు వెళుతుండగా మనుమరాలిని నడిపించకుండా ఇలా తీసుకువెళ్లడం చూపరులను ఆకట్టుకుంది. ఇది చినవంక గ్రామంలో ఆవిష్కృతమైంది. మనమరాలిని తనవెంట తీసుకువెళుతూ ప్రేమను చాటుకున్నారు.

పొన్నచెట్టు వాహనంపై వాసుదేవుడు

- భక్తజనావళి నడుమ ఘనంగా తెప్పోత్సవం ● కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

హరిపురం, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): మందస వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆరో రోజు శనివారం స్వామి పొన్నచెట్టు వాహనంపై వెంకటేశ్వర స్వామి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. త్రిదండి దేవనాథ్ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. అశేష భక్తజనావళి గోవింద నామ స్మరణ మధ్య ఆలయం మారుమోగింది. ఆలయ ప్రధాన అర్చకులు కూర్మాచార్యులు, సత్యానంద పాడి ఆధ్వర్యంలో వేద పండితులు విశేష హోమం చేపట్టారు. సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమంలో గోష్ఠి, యాగశాలలో ద్వారాతోరణ, ధ్వజ కుంభారాధన, శాత్తుముర్రై, ప్రసాద గోష్ఠి తదితర కార్యక్రమాలు చేపట్టారు.



తెప్పోత్సవంలో స్వామివారు

వైభవంగా తెప్పోత్సవం..

సాయం సంధ్య వేళ గోపాల సాగరంలో వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణ మధ్య తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం స్వామి వారిని అశ్వవాహనంపై వేంచేపు చేసి తిరువీధి చేపట్టారు. వేలాది మంది భక్తులు తెప్పోత్సవం, దోపోత్సవాలను తిలకించి తరించారు. స్వామిని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు గౌతు శివాజీ దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నడుమ తెప్పోత్సవం, దోపిడీ ఉత్సవం ఎంతో వైభవంగా జరి గింది. ఆరోరోజు శనివారం దాతల సహకారంతో ఆలయ సన్నిధిలో మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మజ్జిగ, నీరు సౌకర్యాలను శ్రీరామనుజ యువజన సేవాసంఘం కల్పించింది. చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

అంతా నారాయణుడే..

త్రిదండి దేవనాథ్ రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ.. భగవంతుడు ఒక్కడే.. మనం వేడుకున్న పేర్లు వేరైనా స్మరించుకున్న నారాయణుడు ఒక్కడే అన్నారు. వివిధ మతాలు, వివిధ పేర్లు, వివిధ రూపాలతో పిలుచుకున్నా అందరూ పూజించేది భగవంతుడినేనన్నారు. ముక్తితో, భక్తి భావంతో మనం ప్రపంచశాంతికి మార్గం వేయాలని పిలుపునిచ్చారు. మత మార్పిడితో హిందుత్వానికి ముప్పు పొంచి ఉందన్నారు. దేవుడిని స్మరిస్తూ ఆరాధిస్తే.. పాప, దోష నివారణ జరిగి మానవాళికి అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయన్నారు.

నేటి కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివర రోజు ఆదివారం ఉదయం రథోత్సవం, చక్రతీర్థం, అవబృథ స్నానం, సాయంత్రం ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, సాంస్కృతిక కార్యక్రమాలు. విశాఖపట్నం సప్తస్వర సంగీత కళాశాల వారిచే సంగీత విభావరి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పొన్న చెట్టు వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



స్వామిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి శివాజీ



భారీ చేపను చూపిస్తున్న మత్స్యకారుడు

మత్స్యకారుల వలకు చిక్కిన 28 కిలోల చేప

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన మత్స్యకారుల వలకు శుక్రవారం 28 కిలోల కచ్చా చేప చిక్కింది. ఔషధ తయారీలో వినియోగించే ఈ చేప మార్కెట్లో మంచి రేటు పలుకుతుందని మత్స్యకారులు చెబుతున్నారు. ఈ చేప ఆడదైతే కిలో రూ.4 వేలు, మగదైతే కిలో రూ.12 వేలు వరకు ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. రింగు వలలో వేటాడగా ఈ చేప చిక్కినట్టు మత్స్యకారుడు మద్దు లక్ష్మణరావు తెలిపారు. ఆరు నెలల కిందట కూడా ఇదే రకమైన 30 కిలోల చేప వలకు చిక్కిందని తెలిపారు. ఇలాంటి చేపలు అరుదుగా లభిస్తుంటాయని, ఒడిశా వంటి ప్రాంతాల్లో ఇటువంటి చేపలు ఎక్కువ కొనుగోలు చేస్తుంటారని మత్స్యకారులు చెబుతున్నారు.

భక్తులకు ఏలోటూ రాకూడదు

- అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జలుమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శ్రీముఖలింగం ఉత్సవాలు విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. భక్తులకు ఏలోటూ రాకూడదన్నారు. శ్రీముఖలింగంలో శనివారం ఆయన మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రద్దీకి తగ్గట్టుగా బారికేడ్లు ఏర్పాటు చేసి స్వామి దర్శనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈవో పి.ప్రభాకరరావును ఆదేశించారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనానికి వేర్వేరు బారికేడ్లు ఉండాలన్నారు. వీఐపీలకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేసి వారు వచ్చినపుడు సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామంలో అన్ని వీధుల్లోను త్రాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఎక్కడా కూడా పారిశుధ్య సమస్య తలెత్తకుండా కార్మికులను అందుబాటులో ఉంచాలని డీపీవో సౌజన్య భారతికి సూచించారు. కొమనాపల్లి నుంచి కరకవలస వరకు రోడ్డుకిరువైపులా చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులూ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. చక్రతీర్థస్నానాల రోజున వంశధారనది వద్ద వైద్యసేవలు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బాల మురళీకృష్ణకు సూచించారు. ఆలయ ప్రాంగణంలో బారికేడ్లతో పాటు చక్రతీర్థ స్నానాలకు వెళ్లే దారులను కూడా కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానికుల విన్నపం మేరకు ఆలయ ప్రాంగణంలో ప్రసాదాలు విక్రయించాలని దేవాదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్‌ను ఆదేశించారు. పులిహోర, లడ్డు ప్రసాదాలు భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, దేవాదాయశాఖ డీసీ ఎన్.సుజాత, టెక్కలి డీఎస్పీ డీవీఎస్ఎన్ మూర్తి, తహసీల్దారు జె.రామారావు, ఎంపీడీవో కె.అప్పలనాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అయ్యో.. నీ భవిష్యత్ కోసమే కదా!

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న నిర్వాసిత కాలనీలో ఓ ఇంటిపైన ఉరేసుకుని వేలాడుతూ విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. వెంటనే కిందకు దించి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కాశీబుగ్గ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అర్ధరాత్రి దాటిన తరువాత మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శనివారం పంచనామా నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. ఎంతో గారాబంగా పెంచిన ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

వారం రోజుల్లోనే.. పోయింది

(ఐదో పేజీ తరువాయి)

పనులు చేపట్టారని ఆరోపిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ విషయమై పాతపట్నం సెక్షన్ ఆర్‌అండ్‌బీ ఏఈ వి.యోగి వద్ద ప్రస్తావించగా.. ఎక్కడైనా తారు వదిలి రాళ్లు తేలితే.. కాంట్రాక్టర్‌తో మళ్లీ పనులు చేయిస్తామని తెలిపారు. 'ఆల్‌ఆంధ్రా రహదారిలో పెద్ద గుంతలు పూడ్చేలా పనులు చేయించాం. కిలోమీటర్ మేర రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.40లక్షలు అవసరం. కానీ 12కిలోమీటర్లకు రూ.39లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. నిధులు లేక చిన్నచిన్న గుంతల మరమ్మతులు నిలిచిపోయాయి' అని యోగి తెలిపారు.

15మంది లైసెన్స్‌ల రద్దుకు ప్రతిపాదించాం


ట్రాఫిక్ సీఐ నాగరాజు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేసేందుకు శ్రీకాకుళం ఆర్టీవోకి ప్రతిపాదనలు పంపించామని ట్రాఫిక్ సీఐ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో 24 మంది లైసెన్స్‌లు రద్దు చేశామని, ఇప్పుడు మరో 15 లైసెన్స్‌ల రద్దుకి ప్రతిపాదించామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ సెల్ఫ్ యాక్సిడెంట్స్‌తో పాటు ఎదురుగా వస్తున్న వారిని గుద్దేసి ప్రమాదాలకు కారణమవుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వీరంతా గతంలో పలుమార్లు డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పడ్డారని, కౌన్సిలింగ్ ఇచ్చినా వారి తీరులో మార్పు రాకపోవడంతో చర్యలు చేపట్టినట్టు స్పష్టం చేశారు.

చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు డీపీవో కె.భారతి సౌజన్య తెలిపారు. శని, ఆదివారాల్లో అధికారులంతా క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఉదయం 6 గంటలకే అధికారులంతా పంచాయతీల్లో విధులకు హాజరవ్వాలని, రెండు రోజుల్లో వంద శాతం చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న చెత్తకుప్పలు, రోడ్ మార్జిన్, రోడ్డు పక్కన గల దిబ్బలు తొలగించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

కూటమి నేతల ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న కూటమి నేతలు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ఎచ్చెర్ల మండలంలో కూటమి నేతలు శనివారం ప్రచారం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని అధ్యాపకులను కూటమి నేతలు కలిసి వర్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చౌదరి నారాయణమూర్తి, బెండు మల్లేశ్వరరావు, విశ్వక్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్


వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సమస్యలు తీర్చేందుకు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పట్టణంలోని విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో శనివారం ఆయన ప్రజాదర్బార్‌లో పాల్గొని ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులను స్వీకరించారు. ప్రజా సంక్షేమ పాలన దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, సమస్య ఏదైనా తక్షణం పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి రహదారులు, సిమెంటు రోడ్లు, కొళాయిలు, సాగునీటి సమస్యలు వంటి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు


సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నేరాలు నియంత్రణలో భాగంగా మశాఖపురం గ్రామంలో సర్పంచ్, గ్రామ పెద్దలు సహకారంతో మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్ఐ పరిశీలించి, వాటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

అర్హత గల ప్రతి సమస్య పరిష్కరిస్తా

- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద శనివారం ఎమ్మెల్యే కూన రవి కుమార్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాలతోపాటు మున్సిపాలిటీకి చెందిన ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు అధిక సంఖ్యలో అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ వివిధ శాఖల అధికారులు ఫోన్ ద్వారా సమస్యను వివరించి పరిష్కరించాలని ఆదేశించారు. మిగిలిన ప్రతి అర్జీ అర్హతను బట్టి నిర్ణీత సమయంలో పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పనితీరు, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసిన పలువురు తెలుగు యువత కార్యకర్తలకు అభినందించారు. కూటమి నాయకులు పేడాడ సూరపు నాయుడు, గడ్డయ్య, తమ్మినేని గీత, తమ్మినేని చంద్రశేఖర్, ఎస్.మురళీధర్, తంగి గురయ్య నాగళ్ల మురళీధర్, టి.రాము తదితరులు పాల్గొన్నారు.

రేపు యోగ విజ్ఞాన శిబిరం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సురంగిరాజా మైదానంలో ఈ నెల 24వ తేదీ సోమవారం యోగా విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్టు పతాంజలి యోగా గురువు సంజీవ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల ఈ శిబిరం ఉంటుందన్నారు. అలాగే 25వ తేదీ నుంచి రెండు రోజులపాటు పతాంజలి యోగా శ్రమంలో విజ్ఞాన శిబిరం ఉంటుందన్నారు.

నేడు ఉచిత చికెన్, ఎగ్ మేళా

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత చికెన్, ఎగ్ మేళాలను నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జేడీ కె.రాజగోపాల్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్ర 5గంటల నుంచి 7గంటల వరకు పాతబస్టాండ్, ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఈ మేళాను నిర్వహిస్తున్నట్టు జేడీ వివరించారు. సోమవారం చిలకపాలెం, పొందూరు, మంగళవారం నరసన్నపేట, టెక్కలి, హిరమండలం, శుక్రవారం పలాస, సోంపేట ప్రాంతాల్లో ఈ మేళాలను చేపడుతున్నామన్నారు. ఒక్కో ప్రాంతంలో 200 కిలోల చికెన్, రెండు వేల గుడ్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు జేడీ స్పష్టం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 20న (ఆదివారం) పాఠశాలలోనే ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రవేశ పరీక్షలో 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంల్లో పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జి.సిగడాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అధ్యాపక, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శనివారం మండలంలోని పలు పాఠశాలలో ఆమె ప్రచారం చేశారు. యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థిగా బరిలో ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

జాతరకు పటిష్ఠ బందోబస్తు

గార, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వత్సవలసలో జరుగుతున్న రాజమ్మ సంబరాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ పైడపునాయుడు ఎస్ఐ ఆర్.జనార్థన్ తెలిపారు. ఈ మేరకు వారు బందోబస్తు ఏర్పాట్లుపై శనివారం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్లాస్టిక్‌ను నియంత్రించండి

సోంపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధంలో పట్టణ ప్రజలు సహకరించాలని మేజర్ పంచాయతీ సోంపేట ఈవో శాంతికుమారి కోరారు. శనివారం ఉదయం పట్టణంలో ర్యాలీ నిర్వహించి షాపుల యజమానులతో కలసి ప్లాస్టిక్ వాడకడం వల్ల కలిగే అనార్థాలను వివరించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై చర్యలు తప్పవన్నారు.

చెత్త డబ్బాల పంపిణీ

కంచిలి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తలు వేరుచేసి డబ్బాల్లో వేయాలని ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు శనివారం మండలంలో గల కంచిలి, జలంత్రకోట, గోకర్ణపురం పంచాయతీల్లో ఎంపీడీవో సందర్శించి చెత్త డబ్బాలు పంపిణీ చేశారు. శాసనాంలో ఉపాధి పనులు పరిశీలించారు.

యంగ్ ఇండియా పోటీలకు ఎంపిక

కవిటి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యంగ్ ఇండియా కే బోల్ సీజన్-5 పోటీలకు యూత్ కాంగ్రెస్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పి.కిరణ్‌కుమార్ ఎంపికయ్యాడు. శనివారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీల్లో రన్నర్‌గా నిలిచానని, ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్టు తెలిపారు.

ఆ ఉపాధ్యాయుడి దందాను అడ్డుకోండి

- క్వారీ కార్మికుల ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు


సరుబుజ్జిలి పోలీసుస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న క్వారీ కార్మికులు

ఆమదాలవలస, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తమపై దందాకు పాల్పడుతున్న ఓ ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధి గ్రామాలకు చెందిన పలువురు క్వారీ కార్మికులు కోరారు. ఈ మేరకు శనివారం వారంతా ఆయా మండలాల పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు క్వారీ కార్మికులు మాట్లాడారు. బూర్జ మండలం కొరగాం రెవెన్యూ పరిధిలో ఉన్న ముంగన్నకొండపై 20 ఏళ్ల నుంచి సుమారు 150 కుటుంబాలు క్వారీ పనులు (రాళ్లు కొట్టడం) చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని కార్మికులు తూలుగు శ్రీరాములు, గొజ్జల సింహాచలం, గుద్దల చంద్ర, గుజ్జల రమణ, తాడేల మల్లేష్, తాడేల కృష్ణ, వి.రమణ, బి.సింహాచలం, పిట్ట దాలయ్య తదితరులు తెలిపారు. ఈ కొండ పరిసరాలను ఆనుకుని ఉన్న సుమారు ఐదు ఎకరాల డీ-పట్టా భూములను రొట్టవలస గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు కొనుగోలు చేసి తమపై పెత్తనం చెలాయిస్తున్నాడని ఆరోపించారు. క్వారీ ప్రాంతానికి చేరుకోవాలంటే ఈ భూముల మీదుగానే వెళ్లాల్సి ఉండడంతో ప్రతి నెలా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాడని ఆరోపించారు. ఒక్కో క్వారీ కార్మికుల బృందం పది వేల రూపాయలు చెల్లిస్తేనే తన భూముల్లో నడవడానికి అంగీకరిస్తానని హుకుం జారీ చేసి భయ బ్రాంతులకు గురిచేస్తున్నాడని క్వారీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాలకు చెందిన పెద్దలకు ఈ విషయం చెప్పినా.. ఆ ఉపాధ్యాయుడి గత చరిత్ర తెలిసిన వారెవరూ తమకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేది లేక పోలీసులను ఆశ్రయించామని తెలిపారు. రెక్కాడితేగాని డొక్కాడని తమపై దందా చేస్తున్న ఆ ఉపాధ్యాయుడిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు.

పారదర్శకంగా కులగణన జరిపించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ జాబితాలో ఉన్న కులాల గణన పారదర్శకంగా జరిపించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను దళిత సంఘాల జేఏసీ నేతలు తైక్వాండో శ్రీను, డాక్టర్ కంఠవేణు కోరారు. ఈ మేరకు వారు శనివారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అలాగే నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల అంబేడ్కర్ కాంస్య విగ్రహ నిర్మాణ పనులను బాబాసాహెబ్ జయంతి ఏప్రిల్ 14లోగా పూర్తయ్యేలా చూడాలని కోరారు.

'తండేల్' ఒక్కడే కాదు.. ముగ్గురు

- మిగిలిన 21 మత్స్యకార కుటుంబాలకు అన్యాయం జరిగింది
- పలువురు 'పాకిస్థాన్ బాధితుల' ఆవేదన


మాట్లాడుతున్న పలువురు మత్స్యకారులు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తండేల్ చిత్రంలో చూపించినట్టు రియల్ తండేల్ రామారావు ఒక్కడే కాదని, పాకిస్థాన్‌కు దొరికిన మూడు బోట్లలో ముగ్గురు తండేల్‌లు ఉన్నారని బాధిత మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ఎన్జీవో హోమ్‌లో గతంలో పాకిస్తాన్ నావిదళాలకు చిక్కిన మత్స్యకార కుటుంబ సభ్యులు శనివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. పాకిస్థాన్ నావీదళాలకు చిక్కిన 22 మంది మత్స్యకారుల యథార్థ గాధ ఆధారంగా తండేల్ చిత్రం చిత్రీకరించారని, అయితే కేవలం గనగళ్ల రామారావు, అతడి భార్య నూకమ్మకు దక్కుతున్న గౌరవం మిగిలిన 21 మత్స్యకార కుటుంబాలకు దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా కథ రాసే సమయంలో 20 మంది మత్స్యకారులకు రూ.45 వేలు చొప్పున ఇచ్చి సంతకాలు చేయించుకున్నారని, కానీ రామారావు, అతడి బావమరిది ఎర్రయ్యకు మాత్రం రూ.90 వేలు చొప్పున ఇచ్చారన్నారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన తండేల్ సినిమా విజయోత్సవ సంబరాల కార్యక్రమంలో కూడా రామారావు అతడి భార్యను మాత్రమే గౌరవించారని, మిగిలిన వారిని కనీసం స్టేజ్‌పైకి కూడా పిలవకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రామారావుకి రూ.లక్షల్లో నగదు అందడంతో పాటు, ఒక ఇల్లు కూడా చిత్ర యూనిట్ అందించిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా మిగిలిన 21 మంది మత్స్యకార కుటుంబాలకు దక్కాల్సిన గౌరవాన్ని దక్కించాలని వారు చిత్ర యూనిట్‌ను కోరారు. సమావేశంలో చీకటి గురుమూర్తి, సూరాడ ముగతమ్మ, కోనాడ వెంకటలక్ష్మి, కె.అప్పారావు, కిశోర్, పి.మణి, రాజు, భవిరోడు, గురువులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో విస్తృత తనిఖీలు


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ అధికారులు శనివారం విస్తృత స్థాయి తనిఖీలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాలోని అరిణాం అక్కివలస, అల్లినగరం, కుశాలపురం, విజయనగరం జిల్లాలో డెంకాడ, జొన్నాడ, విజయనగరంలో పెట్రోల్ బంకుల్లో నిల్వలు ,నాణ్యత ప్రమాణాలు, రీడింగ్ తదితర వాటిపై విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బంకుల్లో జరిగే అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులతో పాటు సివిల్ సప్లై లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.







యువతను ప్రోత్సహించడమే ఎన్‌వైకే ధ్యేయం


రన్నింగ్ పోటీలు పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువకులకు ప్రోత్సహించడమే నెహ్రూ యువజన కేంద్రం(ఎన్‌వైకే) ధ్యేయమని ఎన్‌వైకే డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ తెలిపారు. స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో శనివారం నిర్వహించిన వివిధ క్లస్టర్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. అనంతరం సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావుతో కలిసి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, వంద మీటర్ల పరుగు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, ఎన్‌వైకే గణాంకాధికారి డి.శ్రీనివాసరావు, శిక్షకులు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

జి.సిగడాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యుత్ అందించాలి

జి.సిగడాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో నిరంతర విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి కోరారు. శనివారం స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో ఏఈ దుర్గాప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వేసవి దృష్ట్యా విద్యు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ఈయన వెంట పలువురు ఉన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయించండి

జి.సిగడాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వేతనదారులతోట కొలత ప్రకారం ఉపాధి పనులు చేయించాలని డ్వామా పీడీ బి.సుధాకర్ అన్నారు. శనివారం మండలంలో జరుగుతున్న పలు ఉపాధి పనులను పరిశీలించారు. తప్పుడు మస్తర్లు వేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో జి.రామకృష్ణ, ఏపీవో సత్యనారాయణ, ఈసీ జి.పురుషోత్తమరావు, టెక్నికల్ అసిస్టెంట్స్ ఉన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిపించాలి

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జంగాల సింగరయ్య యాదవ్, రాష్ట్ర కోచైర్మన్స్ దానా గౌడ్, జి.నవజీవనాపాల్ కోరారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రైవేట్ హోటల్‌లో విలేఖరులతో మాట్లాడారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెట్‌గా పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడిని బీసీలంతా ఏకమై గెలిపించాలని కోరారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీ కళామందిర్‌లో త్యాగరాజ ఆరాధనోత్సవాలు రెండో రోజు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగాయి. గాత్ర సంగీత కచేరి నిర్వహించారు. చెన్నైకి చెందిన గాత్రం రామకృష్ణ మూర్తి, వయోలిన్ మావుడూరు సత్యనారాయణ, మృదంగం వంకాయల వెంకటరమణ, మార్తురు హరిబాబు కీర్తనలు అలరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

రిటైర్డ్ ఆర్మీ జేసీవో మృతి


జానకిరావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ జూనియర్ కమాండ్ ఆఫీసర్ (జేసీవో) కాన జానకిరావు (67) శనివారం మృతి చెందారు. ఈయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గ్రామ స్థులు తెలి పారు. ఆర్మీలో ఉద్యోగ విరమణ చేసిన అనంతరం హెచ్‌పీసీఎల్‌లో సెక్యూ రిటీ సూపరింటెండెంట్‌గా విధులు చేపట్టారు. అక్కుపల్లి గ్రామాభివృద్ధిలో ఈయన చురు కైన పాత్ర పోషించారని శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు మోన వర ప్రసాద్ తెలిపారు. జానకిరావు మృతి తీరని లోటన్నారు. ఈయన కు భార్య పార్వతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

8 కేజీల గంజాయితో 11 మంది అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గుణుపూర్-నౌపడా రైలు ద్వారా గంజా యిని టెక్కలికి తరలిస్తున్న 11 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి విలేకరులతో మాట్లా డుతూ వివరాలు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రం రాయఘడ నుంచి గుణుపూర్-నౌపడా రైలు ద్వారా గంజాయిని తీసుకువచ్చి టెక్కలి ప్రాంతంలో యువకులకు విక్రయిస్తుండగా మేఘవరం పంచాయతీ బొరిగిపేట తోటల్లో పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి సుమారు 8 కేజీల గంజాయి, నాలుగు మోటార్ సైకిళ్లు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. రాయఘడ ప్రాంతం చింతలవానిపేటకు చెందిన కొద్రక బిజయ్ వీరికి గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడడంతో ఈ వ్యవహారం బయటకు పొక్కింది. టెక్కలి శివాలయం వీధికి చెందిన గెడ్డాం దేవేంద్రనాథ్, ఎన్టీఆర్ కాలనీకి చెందిన దేవాది మోహన్, బయ్యా మధు, సంతబొమ్మాళి మండలం కాశీపురానికి చెందిన రాజాపు తరుణ్ కుమార్, ఇజ్జువరానికి చెందిన యండావ దేవనకుమార్, టెక్కలి గాసివీధికి చెందిన నాగవంశపు వంశి, కోదండరామ వీధికి చెందిన బుడుమూరు సాయితేజ, అయ్యప్పనగర్‌కు చెందిన చింతాడ చందు, వజ్రపుకొత్తూరు మండలం పాత టెక్కలికి చెందిన బాడాన అవినాష్, విశాఖపట్నం కొమ్మాది ప్రాంతానికి చెందిన గిన్ని సాయివెంకట నాగవరప్రసాద్ రెడ్డిలను అరెస్టుచేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి నిందితులను కోర్టుకు తరలింమన్నారు. సమావేశంలో ఎస్‌ఐ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్డింగ్ మెటీరియల్ దుకాణంలో చోరీ


దుకాణం గోడౌన్ తాళాలు పగలగొట్టిన దృశ్యం

హరిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మందస కొత్తవీధిలోని సాయి కమల్ బిల్డింగ్ మెటీరియల్ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన చోరీలో సుమారు రూ.లక్షవరకు నగదు అపహరణకు గురైనట్లు ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. దొంగలు దుకాణం వెనుక భాగంలో ఉన్న గోడౌన్ తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడినట్లు గుర్తించారు. షాపులోని సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి విద్యుత్ బల్బులు పీకి దొంగ తనానికి పాల్పడినట్లు చెప్పారు. ఈ ఘటనపై యజమానులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీకాకుళం క్లూస్ టీం, పోలీస్ జాగిలాలతో ఆధారాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఢీకొన్న లారీ.. బోల్తాపడిన ట్రాక్టర్

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


బోల్తాపడిన ట్రాక్టర్

శ్రీకాకుళం రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కరజాడ గ్రామం వద్ద లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ కె.రాము తెలిపిన వివరాల మేరకు.. పొందూరు మండలం నర్సాపురం అగ్రహారం గ్రామానికి చెందిన పిన్నింటి వెంకినాయుడు(45), రమణమ్మ, దుర్గమ్మ హైవే రోడ్డు మరమ్మతు పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో శనివారం ట్రాక్టర్‌పై వెళ్లి కరజాడ వద్ద ఫ్లై ఓవర్‌పై మరమ్మతు పనులు చేసి తిరిగి సాయంత్రం వస్తున్నారు. ఇదే సమయంలో నరసన్నపేట నుంచి విశాఖ వైపు వస్తున్న ఓ లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వెంకినాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, రమణమ్మ, దుర్గమ్మ, ట్రాక్టర్ డ్రైవర్ సందీప్‌శర్మ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పశువులు తరలిస్తున్న వాహనం సీజ్

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కబేలాలకు పశువులతో వెళ్తున్న వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ బి.హైమావతి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా రోడ్డుపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో హిరమండలం మండలం చిన్నకొల్లివలస గ్రామం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేసినట్టు తెలిపారు. ఆ వాహనంలో మూడు ఆవులు, రెండు దూడలను గుర్తించి సదరు వ్యక్తులను ప్రశ్నించగా.. సరైన సమాధానం రాకపోవడంతో కబేళాకు తరలిస్తున్నట్టు నిర్ధారించి కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడిన పశువులను విజయనగరం జిల్లా గుర్ల మండలం గుజ్జంగవలస గోశాలకు తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఇద్దరు వ్యక్తులను ఆమదాలవలస సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎదురు హాజరుపరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు.


సీజ్ చేసిన పశువుల వాహనం

మందగిస్తున్న పనులు

- బిల్లుల చెల్లింపుల్లో జాప్యం


బిల్లుకు నోచుకోని దేవళభద్ర సచివాలయ రహదారి


నర్సిపురం రహదారి నిర్మిస్తున్న దృశ్యం (ఫైల్)

నందిగాం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న 'పల్లెపండగ' పనుల్లో జాప్యం నెలకొంటోంది. బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం కావడంతో పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు విముఖత చూపుతున్నారు. దీంతో పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో లక్ష్యం నెరవేరడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణం, ఇతర పనులపై పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు ఐదేళ్ల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే వైసీపీ ఓటమికి ఓ కారణం అయిం ది. అయితే ఇబ్బందులను గుర్తించిన టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లోని రోడ్ల మరమ్మతులు, కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. 'పల్లెపండగ' పేరుతో కోట్లాది రూపాయలు నిధులు కేటాయించింది. దీంతో గ్రామాల్లో పనులు ఊపందుకున్నాయి. అయితే ప్రస్తుతం పనులు చేపట్టినా బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ఆసక్తి కనబరచడం లేదు. దీంతో అర్థంతరంగా నిలిచిన పనులతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురువుతున్నారు. మండలంలో రూ.14.37 కోట్లతో 305 పనులు మంజూరయ్యాయి. వీటిలో ఎనిమిది పనులు రద్దు కాగా మిగిలిన 297 పనులు మంజూరు చేశారు. ఇంతవరకు 180 వరకు సీసీ రహదారి పనులు పూర్తి కాగా 40 పనులకు మొదటి నెలలో బిల్లులు జరిగాయి. ఆ తరువాత రెండు నెలల నుంచి చేసిన పనులకు బిల్లులు పడకపోతుండడంతో కాంట్రాక్టర్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో మిగిలిన పనుల పూర్తిలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఒకపక్క కలెక్టర్ పల్లె పండగ పనులను పూర్తి చేయాలని ఆదేశాలిస్తున్నా క్షేత్రస్థాయిలో నత్తనడకన సాగుతున్నా యన్న వాదనలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.3.50 కోట్లు మేర చేసిన పనులకు బిల్లులు జమ కావాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేస్తే మిగిలిన పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. దీనిపై మండల ఇంజనీరింగ్ అధికారి పి.సంతోష్ కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా చేసిన పనులు మేరకు ఎం.బుక్‌లో రికార్డు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరి చామన్నారు. ప్రభు త్వం నుంచి నిధులు జమ కావాల్సి ఉందని చెప్పారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

నందిగాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం దేవుపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు కొండాల గోపాలంపై సస్పెన్షన్ వేటు పడింది. ఆ వివరాలిలా ఉన్నాయి.. పాఠశాలలో ఒకటి నుంచి ఏడు తరగతుల వరకు సుమారు 30మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆనందపురంలో పనిచేస్తున్న కొండాల గోపాలం దేవుపురం యూపీ పాఠశాలకు డెప్యుటేషన్‌పై ఆగస్టులో వచ్చారు. ఇటీవల విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిలో భాగంగా ఈనెల 20న మూడో తరగతి విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక ఇబ్బంది పడింది. బాలిక ముభావంగా ఉండడాన్ని గమనించిన తల్లి ప్రశ్నించగా బాలిక విషయం తెలిపింది. దీంతో బాలిక తల్లి శనివారం హెచ్‌ఎం వై.గణపతిరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఎంఈవో-2 చిన్నారువుకు తెలుపగా ఆయన జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్యకు సమాచారమిచ్చారు. డీఈవో తహసీల్దార్ సోమేశ్వరరావు, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ మౌనిక, ఎంఈవోలు జి.నర్శింహులు, చిన్నారావు ఈ ఘటనపై విచారణ చేపట్టారు. ఈ ఘటన నిజమని తేలడంతో గోపాలాన్ని సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో తల్లిదండ్రులు సమావేశమై పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు పెట్టేందుకు సిద్ధమయ్యారు. సదరు ఉపాధ్యాయుడు రెండు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న సమయంలో ఇలా బ్యాడ్ టచ్‌లు, వారి పడిన ఇబ్బందులను పలువురు ఉపాధ్యాయులు వివరించారు. నందిగాం మహి ళా పోలీస్ రోజా, సచివాలయ మహిళా పోలీస్ జ్యోతి.. విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యార్థినుల నుంచి సమాచారం తీసుకున్నారు. ఈ విచారణలో డీటీ ఆర్.రామారావు, ఆర్‌ఐ లీల, వీఆర్వో దేవేంద్ర ఉన్నారు. బాధిత విద్యార్థినికి న్యాయంచేయాలని కోరుతూ గిరిజన సంఘ నాయకులు డీఈవో ఎస్. తిరుమల చైతన్యకు వినతి పత్రం అందించారు. అయితే దానికి సానుకూలంగా స్పందించి సస్పెండ్ చేసినట్లు డీఈవో వివరించారు. వినతి పత్రం అందించిన వారిలో ఎం.నాగరాజు, జగ్గారావు తదితరులున్నారు.


విచారిస్తున్న డీఈవో తిరుమల చైతన్య, తహసీల్దార్ సోమేశ్వరరావు

ప్లాస్టిక్ రహిత పలాస-కాశీబుగ్గలో భాగస్వామ్యం

- కమిషనర్ రామారావు


వ్యాపారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రామారావు

పలాస, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత పలాస- కాశీబుగ్గగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరం భాగస్వాములవుదామని కమిషనర్ ఎన్. రామారావు అన్నారు. ఈ మేరకు కార్యాలయ సమావేశ మందిరంలో పట్టణం లోని వివిధ రకాల వ్యాపారులు, కిరా ణా, చికెన్ దుకాణాలు నిర్వహిస్తున్న వారితో శనివారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ విక్రేతలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కనీసం మూడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ పర్యావరణానికి తీవ్ర విఘాతంగా మారిందని, పట్టణాలు, గ్రామాల్లో కాలువలు, రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలే కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నియంత్రించేందుకు కృషి చేస్తున్నామని, దీనికి వ్యాపారులు సహకరించాలని కోరారు. వినియోగదారులు మార్కెట్‌లోకి వచ్చేటప్పుడు గుడ్డ, గోనె సంచులు తీసుకు రావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: డీఎల్పీవో


హిరమండలం: వర్మీ కంపోస్టు తయారీని పరిశీలిస్తున్న డీఎల్పీవో గోపీబాల

ఎల్.ఎన్.పేట/హిరమండలం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణపై పంచాయతీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని టెక్కలి డివిజన్ డీఎల్పీవో గోపీబాల అన్నారు. చొర్లంగి, హిరమండలంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటి నుంచి చెత్త సేకరణ శతశాతం చేపట్టాలని, ప్రతి ఇంటి నుంచి చెత్తను తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. ఇంటింటినుంచి చెత్తను సేకరించడం వల్ల పారిశుధ్యం మెరుగుపడడంతో పాటు గ్రామాలు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. దీనిలో ప్రజలను భాగస్వాములు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎస్.శ్రీ నివాసులు, పంచాయతీ కార్యదర్శి జి.తవిటి నాయుడు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 9మందికి గాయాలు

జి.సిగడాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చెట్టుపొదిలాం గ్రామంలో కుక్కలు దాడి చేసి తొమ్మిది మందిని గాయపరిచాయి. గత రెండు రోజులుగా కుక్కలు దాడి చేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన సింహాద్రి జయలక్ష్మి, కిలారి ప్రభావతి, వెంకునాయుడు, గొల్లయ్య, బాలరాజు, ఎ.గౌరీశ్వరి, సోములమ్మలతో పాటు మరికొంత మంది గాయ పడ్డారు. శనివారం జయలక్ష్మితో పాటు పలువురు గాయపడ్డారు. కుక్కల దాడిలో గాయపడిన వారు రాజాం, పొందూరు, బాతువ పీహెచ్‌లకు వెళ్లి చికిత్స తీసుకున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావాలంటే గ్రామస్థులు భయపడుతున్నారు. కుక్కల నివారణకు అధికారులు చర్యలు తీసుకో వాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ కాలనీ 8వ లైన్‌లో తాగునీటి ఇక్కట్లు



టెక్కలి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ ఎన్టీ ఆర్ కాలనీ 8వ లైన్‌లో తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని స్థానికులు పేర్కొన్నారు. వేసవి రాకుండానే నీటి ఇబ్బందులు తలెత్తుతు న్నాయని పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, గేదెల శివ కోరారు. అలాగే గ్రామపంచాయతీలో ఎక్కడెక్కడ తాగునీటి సమస్యలున్నాయో గుర్తించి పరిష్కరించాలన్నారు.

వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ

మెళియాపుట్టి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ వహించా లని ఐటీడీఏ డీడీ అన్నాదొర అన్నారు. శనివారం రాత్రి నేలబొంతు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకుని పరీక్షలంటే భయం పోగొట్టాలన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి డిప్యూటీ సీఎం కృషి

మెళియాపుట్టి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తారని జనసేన జిల్లా అధ్యక్షుడు పి.చంద్రమోహన్ అన్నారు. గొట్టిపల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురైన సోమేశ్వరరావుకు శనివారం ఆర్థిక సాయం అందించారు. వైసీపీ ప్రభుత్వం గిరిజనులకు చేసిన అన్యాయం వల్ల వెనుకబాటు కనిపిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో వివిధ పథకాల అమలు ద్వారా గిరిజనులను అభివృద్ధిపథంలోకి తీసుకురావడం జరుగు తుంద న్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రామ్మూర్తి, చంటి, కిరణ్‌కుమార్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను బోధించాలి

కొత్తూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు మాతృ భాషను బోధించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కొత్తూరు హైస్కూల్ హెచ్‌ఎం ఎ.గోవింద రావు అన్నారు. శనివారం కొత్తూరు, నివగాం కళాశాల ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై జరుగుతున్న నాల్గో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా మాతృభాష, అక్షర జ్ఞానాన్ని అందించి చిన్నారురు సత్ప్రవర్తనకు అలవాటు పడేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కొత్తూరు సెక్టార్ సూపర్‌వైజర్ లింగాల శాంతి కుమారి, రిసోర్సుపర్సన్లు చంద్రకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్‌తో నిఘా


డ్రోన్‌తో తీసిన చిత్రం

పలాస, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో అసాంఘిక కార్యక లాపాలపై డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కోసంగిపురం, సూదికొండకాలనీ, నెమలికొండ, జయరామచంద్రపురం, పెంటిభద్ర ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఉన్న చెరువులు, తోటల్లో సర్వే చేశారు. ప్రత్యేక పోలీసు టీమ్ సోదాలు చేపట్టాయి. ఈ సందర్భంగా సీఐ సూర్యనారాయణ మా ట్లాడుతూ.. డ్రోన్ నిఘా నిరంతరం కొనసాగుతుందని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, గంజాయి రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, తాగిన వారు, అమ్మిన వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎన్నికల కోడ్ అనంతరం గ్రామాల వారీగా సమస్యలు తెలుసుకుంటానన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సోషల్‌మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, పల్లిపేట, రాజారాంపురం, అంపలాం గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

పశుబీమాతో పాడి రైతుకు భరోసా

పాతపట్నం, ఫిబ్రవరి 22(పాతపట్నం): పశుబీమాతో పాడి రైతుకు భరోసా కలుగుతుందని పశు సంవర్థక శాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు అన్నారు. సీదిగ్రామంలో పశుబీమా స్పెష ల్ డ్రైవ్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుబీమాలో రూ.15 వేలు విలువ చేసే పశువుకు రూ.960 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. మా మూడేళ్ల వరకు బీమా గడువు ఉంటుందన్నారు. టెక్కలి డివిజన్‌లో ఇప్పటివరకు 33 పాడి పశువులకు బీమా చేయించినట్లు తెలిపారు.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తులు

పోలాకి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఈదులవలస మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాల ప్రాంగణంలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షకు మార్చి 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 70329 96528, 96527 30073 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ధనరాజ తులసమ్మతల్లి గుడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయ పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మందస మండలం కిల్లోయి కాలనీకి చెందిన సవర రవికుమార్, సవర సూర్య శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై సున్నాపురం బీచ్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా.. ఇచ్ఛాపురం దాటి లొద్దపుట్టి ధనరాజ తులసమ్మ గుడి వద్ద డివైడర్‌ను ఢీకొట్టి అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయారు. వీరిని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

లోహరిబంద డిజిటల్ అసిస్టెంట్ సస్పెన్షన్

హరిపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మందస మండలం లోహరిబంద సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ షేక్ ఖాదర్ బుఖారిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో కార్యాలయ ఏవో రుషికేశ్వరరావు శనివారం తెలిపారు. సర్వీస్ చార్జి కింద వసూలే చేసిన రూ.96 వేలు సంబంధిత ఖాతాలకు జమ చేయకపోవడంతో ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా స్పందన లేదని, దీంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నరసన్నపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో బి.మధుసూదనరావు తెలిపారు. రూ.5 లక్షలతో కొనుగోలు చేసిన బోరుబావుల సామగ్రిని శనివారం పరిశీలించారు. పాడైన బోర్లకు మరమ్మ తులు చేపట్టి నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళీధర్, చింతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో హారిక ప్రతిభ

నరసన్నపేట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లా నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల విద్యార్థిని బెవర హారిక ప్రతిభ కనపరిచింది. అథ్లెటిక్స్ విభాగంగా 100 మీటర్ల పరుగు పందె పోటీలో ఈమె ద్వితీయ స్థానం సంపాదించింది. ఈ మేరకు సెట్‌శ్రీ సీఈవో బి.ప్రసాదరావు, నెహ్రూయువకేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హారికను కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్ అభినందించారు.

ఆట పరికరాల ఏర్పాటు

టెక్కలి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మేఘవరం పంచాయతీ బొరిగిపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు డిజైనర్ రాక్స్ గ్రానైట్ సంస్థ ఆట పరిక రాలు అందజేసింది. పాఠశాలలో చదువు కుంటున్న 140 మంది పిల్లలకు స్కూల్ బ్యాగులను శనివారం అందజేశారు. అలాగే పాఠశాల ఆవరణలో జారుడు బల్లలు, రంగుల రాట్నం, జంపింగ్ ఉయ్యాలను సంస్థ డైరెక్టర్ శివప్రసాద్ సూచనల మేరకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులకు హెచ్‌ఎం సురేష్ కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ అల్లు మాధవరావు అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్ నారాయణస్వామి, సౌర రామారావు, దివ్వల కామన్న, కెల్లి శ్రీరాములు, రాజు, రాఘవరావు, ఢిల్లీ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

నందిగాం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అన్నాపురంలో అభయాంజనేయస్వామి మందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్థుల ఆధ్వర్యంలో అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు చేపట్టారు. విగ్రహాన్ని ఊరేగించారు. ఆదివారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠతో పాటు వివిధ పూజా కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

రామయ్యతండ్రి ఉత్సవాలు

జలుమూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో శనివారం రామయ్యతండ్రి సంబరాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిమడాం, నగిరికటకం, అబ్బాయిపేట తదితర గ్రామాల్లో రామయ్యతండ్రి సంబరాల్లో భాగంగా తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. స్వామిని కొండ దింపి కోలతో తపిటగుళ్ల ఆటల నడుమ ఊరేగించిన అనంతరం తిరిగి కొండెక్కించి ఉత్సవాలు ముగించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేయాలి

హిరమండలం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంశధార ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన బర్రిపేటలో కొందరు గతంలో అక్రమంగా పునరావాస స్థలాలకు చెందిన పట్టాలను పొందారని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని బూర్లె శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ హనుమంతురావుకు ఫిర్యాదు చేశారు. కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1, బిట్-2, సుభలయ ఆర్‌ఆర్ కాలనీ, గాజుల కొల్లివలస నిర్వాసితుల పునరావాస కాలనీల్లో అక్రమంగా పట్టాలు పొంది ఉన్నారన్నారు. ఒకే వ్యక్తి వారి కుటుంబ సభ్యుల పేర్లపై ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం జరిగిందని, తగు చర్యలు చేపట్టాలని కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లిలోని శివసాగర్ తీరంలోని శ్రీనీల కంఠశ్వర ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి ఏర్పా ట్లలో భాగంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు పువ్వల జోగారావు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేకంగా అలంకరించారు. బాతుపురం, అక్కుపల్లి, బైపల్లి గ్రామాలకు చెందిన భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.